క్లుప్తంగా

కరాటే పోటీల్లో షణ్ముఖికి ప్రథమ స్థానం



భవానీపురం(విజయవాడపశ్చిమ): నెల్లూరులో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ –2023లో జేకే గోజుర్యై కరాటే అకాడమి సత్యనారాయణపురం బ్రాంచికి చెందిన షణ్ముఖి ప్రథమ స్థానంలో నిలిచింది. బాలికల కేటగిరి అండర్ 18 విభాగంలో పీవీ షణ్ముఖి, కేటగిరి అండర్ 16 బాలికల విభాగంలో లాస్య ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. బాలుర కేటగిరి అండర్ 10 విభాగంలో లీలాకృష్ణయాదవ్ తృతీయ, అండర్ 12 విభాగంలో కె.చరిష్ తృతీయ స్థానాలను పొందారు. జేకే గోజుర్యై కరాటే అకాడమి కేఎఐ చైర్మన్ డాక్టర్ బ్రహ్మానందం, సెక్రటరీ జె. శ్రీనివాసులు, హెడ్ కోచ్ జె.హరనాథ్, సత్యనారాయణపురం బ్రాంచ్ కోచ్ పీవీకేఎస్ హర్ష, ట్రెజరర్ సీహెచ్ మహేష్‌బాబు, మధు, జె. దినేష్, టోర్నమెంట్ ఆర్గనైజర్ డాక్టర్ విజయన్ విజేతలను అభినందించారు.

వినాయకుడికి మకరతోరణం సమర్పణ



భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని వినాయకుడి గర్భాలయంలో స్వామివారికి రూ.28 వేలు విలువైన మకర తోరణాన్ని విజయవాడకు చెందిన దాతలు పిచ్చుక శ్రీనివాస్, సుజాత, రోహిత్‌లు సమర్పించారు. ఆదివారం సాయంత్రం సంబంధిత మకరతోరణాన్ని వారి వియ్యంకుడైన మెండు భాస్కరరావు (సాయిరామ్) దంపతులు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివ సత్యవతి దంపతులకు అందజేశారు.

ప్రజా కాపునాడు నగర కార్యదర్శిగా రామకృష్ణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజా కాపునాడు విజయవాడ సిటీ కార్యదర్శిగా కొత్తవారి రామకృష్ణ నియమితులయ్యారు. ఆదివారం గవర్నర్‌పేటలోని ప్రజా కాపునాడు కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు అంజిబాబు నియామక పత్రం అందజేశారు. అంజిబాబు మాట్లాడుతూ కాపుల సమస్యల పరిష్కారానికి పోరాడాలని కమిటీ సభ్యులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా కాపునాడు ప్రతినిధులు జానకి రామారావు, పసుపులేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి ముందు గొడవ పడవద్దని వారించిన యువకుడిపై దాడి చేసిన ఐదుగురిపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత రాజరాజేశ్వరి పేటకు చెందిన అంచిపోగు వెంకటేశ్వర్లు బీఆర్టీఎస్ రోడ్డులోని ఓ హాస్పటల్‌లో ఆరోగ్యశ్రీకి మేనేజర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. శనివారం అర్ధరాత్రి డ్యూటీ ముగించుకున్న వెంకటేశ్వర్లు ఇంటికి వచ్చాడు. తన ఇంటి ముందు సులేమాన్, బంటి అనే వారు గొడవ పడుతుండగా అడ్డుకున్నారు. దీంతో వారిద్దరు తమ స్నేహితులను తీసుకువచ్చి వెంకటేశ్వర్లుపై దాడి చేశారు. వెంకటేశ్వర్లు మూతికి గాయం కావడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

మరియమాతను ఆశ్రయిస్తే దీవెనలు..

గుణదల (విజయవాడ తూర్పు): మరియమాతను ఆశ్రయిస్తే జీవితంలో శాంతి సమాధానాలతో పాటు దీవెనలు కలుగుతాయని గుణదల మేరిమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ జయరాజ్ అన్నారు. పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో ఆదివారం సమష్టి దివ్యబలి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మరియమాతను సకల జనులు లోకమాతగా కొనియాడుతున్నారన్నారు. క్రీస్తును ఈ లోకానికి అందించడం ద్వారా సర్వజనులకు రక్షణ చేకూరిందని తెలిపారు. సమష్టి దివ్యబలిపూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రగ్గుల పంపిణీ

పెనమలూరు: మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలో హెబ్రోన్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు రగ్గులు పంపిణీ చేశారు. బ్రదర్ భక్తసింగ్ 23వ వర్ధంతి సందర్భంగా ఎస్టీకాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్రదర్ రజనీష్ పాల్గొన్నారు. ఎస్టీ కాలనీ వాసులకు ప్రార్థనా మందిరం నిర్మాణం చేశామని, పేదలకు ఉచితంగా రగ్గులు, బైబిల్‌లు పంపిణీ చేశామని తెలిపారు.

కొలువుదీరిన భారీ గణనాథులు

వన్‌టౌన్‌లో భారీ సెట్టింగ్‌లు, పందిళ్లకు విద్యుత్ అలంకరణ



సమ్మెట వారి వీధిలో కొలువుదీరిన గణపతి



వస్త్రలత ప్రాంగణానికి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లో వివిధ ప్రాంతాల్లో భారీ గణనాథులు కొలువుదీరారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే వినాయకచవితి ఉత్సవాలకు వన్‌టౌన్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. తొలి పూజను అందుకునే గణనాథుడు అన్ని వేళలా అండగా ఉండాలని వ్యాపార సంఘాలు, మిత్ర బృందాలు, వివిధ సమూహాలు వన్‌టౌన్‌లోని వీధివీధినా ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

వివిధ రూపాల్లో గణనాథులు

వన్‌టౌన్‌లో అడుగు నుంచి 15 అడుగుల మేర వినాయక విగ్రహాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కొన్ని ప్రత్యేకతలతో కూడిన విగ్రహాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. సమ్మెటవారి వీధిలో రైతు గణపతిని ఆ పక్కనే మహాగణపతి కొలువుదీరాడు. కందుల వారివీధిలో చూడముచ్చటగా ఉన్న గణనాథుడిని, కోల్‌కతా, ముంబాయి ప్రాంత సంప్రదాయాలకు అనుగుణంగా హైదరాబాద్‌లో తయారైన బొజ్జగణపయ్య విగ్రహాలు వన్‌టౌన్‌లో ఆయా పందిళ్లలో కొలువుదీరాయి.

విగ్రహాలకు లక్ష మేర వ్యయం

నగరంలో కొనుగోలు చేసి తీసుకొచ్చే విగ్రహాల విషయాన్ని పక్కన పెడితే బయట ప్రాంతాల నుంచి తీసుకొచ్చే విగ్రహాలకు వేలాది రూపాయాలను ఖర్చు చేస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి ఇరవై వేల నుంచి లక్ష రూపాయల మేర వ్యయం చేసి విగ్రహాలను కొనుగోలు చేసినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. విగ్రహాలను కొనడటం ఒక ఎత్తయితే వాటిని నగరానికి తీసుకొచ్చి పందిట్లో నిలపడం మరో ఎత్తని వారు చెబుతున్నారు. విగ్రహాలను నిలపటం, దాని చుట్టూ ప్రత్యేక అలంకరణ, ఇతర సెట్టింగ్‌లకు సుమారు లక్ష నుంచి లక్షన్నర మేర ఖర్చు చేయడం విశేషం. ఇవి కాకుండా ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఊరేగింపు ఇతర ఏర్పాట్లకు లక్షలాది రూపాయాల వ్యయాన్ని చేస్తున్నారు.





కందుల వారి వీధిలో (మార్వాడి సంఘం) ఏర్పాటు చేసిన గణనాథుడు ; పూలబావివీధిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అలంకరణ

ఉత్సవ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

- 11 రోజుల వరకే వినాయక ఉత్సవాల పందిళ్లకు అనుమతి
- భద్రత బాధ్యత ఉత్సవ నిర్వాహకులదే



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్, సీఐలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులు కచ్చితంగా నియమ నిబంధనలను పాటించాలని సౌత్ డివిజన్ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ సూచించారు. కృష్ణలంక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం సీఐ ఎం.వి.దుర్గారావు ఆధ్వర్యాన కృష్ణలంక, సూర్యారావుపేట, గవర్నర్‌పేట స్టేషన్ల పరిధిలోని వినాయక మండపాల కమిటీ ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించారు. నియమ నిబంధనలు, నిమర్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ రవికిరణ్ మాట్లాడుతూ 11 రోజుల వరకే వినాయక ఉత్సవాలు పందిళ్లకు అనుమతి ఇస్తామన్నారు. ఉత్సవాల ఊరేగింపును రాత్రి 11 వరకే చేయాలని, హైవే ఎక్కిన తర్వాత ర్యాలీలు, ఉత్సవాలకు అనుమతి లేదని తెలిపారు. రాత్రి 11 గంటలలోపే నిమజ్జన ప్రాంతానికి చేరుకోవాలని, తర్వాత అనుమతించబోమన్నారు. ఆర్గనైజర్లు, సభ్యుల పేర్లను, ఫోన్ నంబర్ ముందుగా పోలీసులకు తెలియజేయాలన్నారు. మైక్‌ను ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలని చెప్పారు. ఐలవ్ అమరావతి ఐకాన్ వరకే ఉత్సవ నిర్వాహకులను అనుమతిస్తారని, అక్కడ నుంచి మున్సిపాలిటీ సిబ్బంది సాయంతో పోలీసులు నిమజ్జనం ప్రదేశానికి విగ్రహాలను తీసుకెళ్తారన్నారు. తగిన భద్రతను నిర్వాహకులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఊరేగింపులో కర్రలు, ఇతర ఆయుధాలు ధరించకూడదన్నారు. ఊరేగింపు సమయంలో ఇతర కులాలకు వ్యతిరేకంగా నినాదాలు చేయడం, ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించడం చేయకూడదని తెలిపారు. వినాయక పందిళ్లు గానీ, విగ్రహం పెట్టే ప్రదేశంగానీ రోడ్డుపై ఉండరాదన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పందిరి పరిసరాల్లో పొగ తాగడం నిషేధమన్నారు. ఫిర్యాదు అందినా, నిబంధనలు అతిక్రమించినా పర్మిషన్ రద్దు చేస్తారని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో కృష్ణలంక, సూర్యారావుపేట, గవర్నర్‌పేట సీఐలు ఎం.వి.దుర్గారావు, బి.హెచ్. వెంకటేశ్వర్లు, డి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా నగర మార్కెట్లు



కేజీ మార్కెట్ సెంటర్‌లో చిరువ్యాపారుల సందడి



కొత్తపేటలో..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని నగరంలో మార్కెట్లు ఆదివారం సందడిగా కనిపించాయి. పత్రి, వివిధ రకాల పూజా సామగ్రి, వినాయకుని విగ్రహాలు, విగ్రహాల తయారీదారులు, గొడుగులు, పండ్ల వ్యాపారులు భారీగా తమ విక్రయాలను కొనసాగిస్తున్నారు.

కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్ వ్యాపారులతో పూర్తిగా నిండిపోయింది. హెడ్‌పోస్టాఫీస్, వస్త్రలత, కాళేశ్వరరావు మార్కెట్ కాంప్లెక్స్ భవనాల చుట్టూ వ్యాపారులు ఆక్రమించుకొని పత్రి ఇతర పూజా సామగ్రిని విక్రయిస్తున్నారు. శివాలయం వీధి సైతం వ్యాపారులతో నిండిపోయింది. కొత్తపేటలోని గణపతిరావురోడ్డు తదితర ప్రాంతాలు సైతం సందడిగా కనిపించాయి.

చవితి వేడుకలతో పర్యావరణానికి మేలు



మట్టిప్రతిమలను పంపిణీ చేస్తున్న గోకవరపు మురళీకృష్ణ తదితరులు



కేఎల్‌రావు పార్కు రోడ్డులో ఫైర్‌స్టేషన్ వద్ద విగ్రహాల పంపిణీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వినాయకచవితి వేడుకలు పర్యావరణానికి మేలు చేసే విధంగా ఉండాలని విజయవాడ హోల్‌సేల్ అండ్ రిటైల్ పూజ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోకవరపు మురళీకృష్ణ, ఎం.కృష్ణారావు అన్నారు. పాతబస్తీ మెయిన్‌బజార్‌లో ఆదివారం మట్టి గణపతి విగ్రహాల పంపిణీ చేశారు. గోకవరపు మురళీకృష్ణ, కృష్ణారావు మాట్లాడుతూ పండుగతో ప్రకృతికి విఘాతం కలగకూడదన్నారు. వినాయకుడు ప్రకృతిని ప్రేమించమనే సందేశాన్ని ఆయన జీవితం ద్వారా అందిస్తున్నారన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ విగ్రహాల పంపిణీ జరిగింది.

కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు శీరం బాలసుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శి దారా సత్యనారాయణ, కోశాధికారి పువ్వాడ తాండవ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శబరిమల అయ్యప్ప సేవ సమాజం, శ్రీగణేష్ ఉత్సవ సమితి విజయవాడ మహానగర్ ఆధ్వర్యంలో ఆదివారం మట్టి వినాయకుడి విగ్రహాల పంపిణీ జరిగింది. కేఎల్‌రావునగర్ పార్కు రోడ్డు ఫైర్‌స్టేషన్ వద్ద అవ్వారు బుల్లాబ్బాయి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ విగ్రహాలను అందజేశారు. ఈ ఏడాది నగరంలో మూడు వేలకుపైగా మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శివకుమార్ పట్నాయక్, గుగ్గిలం విజయ్‌కుమార్, బేరం శ్రీనివాసరావు, ధనాల శ్రీనివాసరావు, అవ్వారు సుబ్బారావు, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): పెజ్జోనిపేట డేవిడ్ వీధిలో వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోలిమెట్ల శరత్‌బాబు ఆధ్వర్యాన ఆదివారం జరిగిన మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా 35వ డివిజన్ కార్పొరేటర్ బలసాని మణిమ్మ పాల్గొన్నారు. స్థానిక నేతలు బాల, శివ, సుజాత, మేరి, బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భార్య, కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భార్య, కుమార్తె కనిపించడం లేదంటూ భవానీపురం బ్యాంక్ సెంటర్‌కు చెందిన వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భవానీపురం బ్యాంక్ సెంటర్‌కు చెందిన మాలిపాటి ప్రసాద్, శ్రావణికి ఐదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. శుక్రవారం ఉదయం శ్రావణి పక్కింటి కుర్రాడితో వాట్సాప్ చాటింగ్ చేస్తోంది. అది గమనించిన భర్త ఆమెను తిట్టి కొట్టాడు. శనివారం ఉదయం భర్త ఇంటిలో నిద్ర పోతుండగా కుమార్తెను తీసుకుని శ్రావణి ఇంటి నుంచి వెళ్లిపోయింది. నిద్ర లేచి చూడగా భార్య, కుమార్తె కనిపించకపోవడంతో ఆమెకు ఫోన్ చేశాడు. ఫోన్ లిఫ్ట్ చేసిన శ్రావణి తన గురించి వెతకొద్దని చెప్పింది. దీనిపై భవానీపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బాలిక అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం విద్యాధరపురానికి చెందిన 15 ఏళ్ల బాలిక గాంధీజీ మున్సిపల్ స్కూల్లో 9వ తరగతి విద్యార్థిని. శనివారం షాపునకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. చుట్టుపక్కల వారిని అడిగినా ఆచూకీ తెలియకపోవడంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలో ఒకసారి ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలికను పోలీసులు వెదికి అప్పగించారని ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

హెచ్‌ఐవీ బాధితులు పౌష్టికాహారం తీసుకోవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): హెచ్‌ఐవీ ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులు చక్కటి పౌష్టికాహారం తీసుకోవాలని విజయ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ డాక్టర్ జి. ప్రశాంతి అన్నారు. ఆదివారం గాంధీనగర్‌లోని నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలోని యువభవన్‌లో హెచ్‌ఐవీ బాధిత కుటుంబాలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. నవజీవన్ బాలభవన్ డైరెక్టర్ నీలం రత్నకుమార్‌తో కలిసి బాధిత కుటుంబాలకు పౌష్టికాహారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ మనోధైర్యం ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. ఆరోగ్యకర జీవనానికి పౌష్టికాహారం తీసుకోవాలని, యోగా, శారీరక శ్రమ చేయాలని సూచించారు. నవజీవన్ బాల భవన్ డైరెక్టర్ నీలం రత్నకుమార్ మాట్లాడుతూ రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. రిసోర్స్ కోఆర్డినేటర్ ఎం.మస్తాన్ మాట్లాడుతూ ఎస్‌ఆర్‌ఐలు కిజరం ప్రశాంత్, జైని కాశీనాథ్, నాలం ఫణీంద్ర, కాంతి అభిషేక్, గార్లపల్లి నిఖిల్ రాజు సహకారంతో పౌష్టికాహారం అందజేశామన్నారు.

సీఎం జగన్‌కు అండగా ఉంటాం

ఆజాద్ ముస్లిం కమిటీ అధ్యక్షుడు నాగుల్‌మీరా



ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర కార్యవర్గం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముస్లింలకు అన్ని రంగాల్లో పెద్ద పీట వేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి అండగా ఉంటామని ఆజాద్ ముస్లిం కమిటీ అధ్యక్షుడు నాగుల్‌మీరా చెప్పారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో కమిటీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర కార్యవర్గం ఎన్నికైంది. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా షేక్ నాగుల్‌మీరా, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అబ్దుల్ అజ్మతుల్లా, ఎండీ కాలేషా, నాగుల్ మీరా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షేక్ సాజిద్ అలీ, కోశాధికారిగా షేక్ రఫీ, రాష్ట్ర అధికార ప్రతినిధిగా సయ్యద్ మౌలాలి, షేక్ కలందర్, రాష్ట్ర కార్యదర్శులుగా షేక్ ఇమ్రాన్, షేక్ బషీర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా షేక్ హుస్సేన్ ఎన్నికయ్యారు. వీరితో పాటు ఐదుగురు సహాయ కార్యదర్శులు, 10 మంది రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శులు,12 మంది రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగుల్‌మీరా మాట్లాడుతూ మైనార్టీలకు రాష్ట్రంలో నాలుగు ఎమ్మెల్సీ స్థానాలు, ఐదుగురు ఎమ్మెల్యేలు, 12 మందిని కార్పొరేషన్లు చైర్మన్లుగా నియమించారన్నారు. నాలుగోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన నాగుల్‌మీరాను పలువురు సత్కరించారు.

స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రండి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కంచర్ల సుధాకర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకుని కొత్త ప్రభుత్వాస్పత్రిలోని బ్లడ్‌బ్యాంక్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో వచ్చిన రోగులకు శస్త్రచికిత్సలు నిర్వహించడానికి పలువురికి రక్తం అవసరమవుతుందన్నారు. అలాంటి వారికి స్వచ్ఛందంగా చేసిన రక్తదానం ఉపయోగపడుతుందన్నారు. శిబిరంలో వైద్యులు, పోస్టు గ్రాడ్యుయేషన్ వైద్య విద్యార్థులు, హౌస్‌సర్జన్‌లు 25 మంది రక్తదానం చేశారు. స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమం అక్టోబరు 2 నేషనల్ వలంటరీ డే వరకూ కొనసాగనుంది.జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ జూపూడి ఉషారాణి, బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రంజిత, కౌన్సిలర్ జోస్ఫిన్, డీపీఎం కిరణ్ పాల్గొన్నారు.

పక్కాగా ఆరోగ్య సర్వే

డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే పక్కాగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని సూచించారు. లంబాడీపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో రాజీవ్‌శర్మనగర్, సిండికేట్ బ్యాంక్ కాలనీల్లో జరుగుతున్న ఏఎన్‌ఎం ఇంటింటి సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వేలో అనారోగ్యం, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నట్లు గుర్తిస్తే, జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో సేవలు పొందడానికి టోకెన్లు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో లంబాడీపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ భావన, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ సేవాసంఘం కార్యవర్గం ఎన్నిక

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ క్షత్రియ సేవాసంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. అయోధ్యనగర్ అద్దేపల్లి వెంకట సుబ్బరాజు క్షత్రియ భవన్ విజయవాడ క్షత్రియ సేవాసంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. 2023–26 సంవత్సరానికి కార్యవర్గం ఎన్నిక జరిగింది. నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా సాగి నరసింహరాజు, ప్రధాన కార్యదర్శిగా ఉద్దరాజు విజయరామరాజు, ఉపాధ్యక్షులుగా దంతులూరి రామలింగరాజు, సామంతపూడి వెంకట సుబ్బరాజు, పెనుమత్స అప్పలరాజు, సామంతపూడి వెంకట వరప్రసాదరాజు, కోశాధికారిగా డీజేపీఎస్ రాజు, జాయింట్ సెక్రటరీగా లఖంరాజు నారాయణ బాబు, కాకర్లపూడి శ్రీధర్ వర్మ, చేకూరి జగన్నాథరాజు, క్లోపల్లి రామకృష్ణరాజు ఎన్నికయ్యారు.

విద్యార్థుల ప్రతిభ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): స్పార్క్ చెస్ అకాడమి శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్‌లో శ్రీగౌతమ్ విద్యార్థులు ప్రతిభ కనపరిచారని కోచ్ రామకృష్ణ పేర్కొన్నారు. పిల్లా దుర్గాప్రసాద్ అండర్ 14 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించారన్నారు. అండర్–12 విభాగంలో విజ్జి హేమంత్ కుమార్ బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన ఈ విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ నల్లాని సూర్యారావు, కోచ్ రామకృష్ణ తదితరులు అభినందించారు.